సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 3 । మే । 2023



మత్స్య మాడుగులమ్మ సంబరాలు
మత్స్య మాడుగులమ్మ తల్లి సంబరాలు అంబరాన్నంటాయి. జి. మాడుగులలో ఈ వేడుకలు నిర్వహించారు.
8లో



విశాఖకు సమున్నత స్థానం
విశాఖను దేశంలో సమున్నత స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో సీఎం అడుగులేస్తున్నారని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు.
8లో



సృజనాత్మకతే పెట్టుబడి
సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడిగా యువతరం అంకుర సంస్థలను స్థాపించాలని, ఏయూ వీసీ ప్రసాద రెడ్డి అన్నారు.
8లో

ఉజ్వలాంధ్ర

- రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- రూ. 21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్
- రూ.2వేల కోట్లతో తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణం
- సీఎం జగన్ చేతుల మీదుగా నేడు శంకుస్థాపన
- విమానాశ్రయం నుంచి విశాఖ వైపు మరింత అభివృద్ధి
- 139.16 ఎకరాల్లో రెసిడెన్షియల్ ఏరియా డెవలప్‌మెంట్


భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనా

భోగాపురం ఎయిర్‌పోర్టు

విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
రన్‌వే పొడవు	3.8 కి.మీ
తొలి దశ	ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలు
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్రవాసుల కలలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ఇటీవలే శ్రీకాకుళంలో మూలపేట పోర్టు పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. బుధవారం మరిన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.4,592 కోట్లతో భోగాపురం వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.21,844 కోట్ల పెట్టుబడులతో మధురవాడ ఐటీ హిల్‌లో అదానీ డేటా సెంటర్, సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారకరామ తీర్థ సాగర్, జెట్టీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఒకవైపు అంతర్జాతీయ విమానాశ్రయం.. మరోవైపు అదానీ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం పోర్టు, జెట్టీ, రైతుల సంక్షేమం కోసం రిజర్వాయర్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర.. ఉజ్వలాంధ్రగా మారనుందని అందరిలో సంతోషం వ్యక్తమవుతోంది.

రెండు వారాల వ్యవధిలోనే..

కొద్ది రోజుల కిందట శ్రీకాకుళం జిల్లాలో రూ.4,362 కోట్ల వ్యయంతో చేపడుతున్న మూలపేట పోర్టు పనులకు సీఎం శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అలాగే రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్ట్ పనులు, రూ.300 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మరిన్ని భారీ పెట్టుబడులకు పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేస్తుండటం విశేషం. ఈ పెట్టుబడుల ప్రవాహంతో స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారనుంది.

విశాఖ వైపు మరింత అభివృద్ధి

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం అధునాతనంగా రూపుదిద్దుకోనుంది. ఒకేసారి 22 విమానాలను నిలిపి ఉంచేందుకు వీలుగా.. ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణికులు విమానయానానికి అనుగుణంగా రూ.4,592 కోట్ల పెట్టుబడితో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీ కూడా ఏర్పాటు కానుంది. భోగాపురం నుంచి విశాఖ వైపు అభివృద్ధి చేసేందుకు అనుగుణంగా 154.74 ఎకరాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. 139.16 ఎకరాల్లో విశాఖ నగరం వైపునకు రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా భోగాపురం నుంచి విశాఖ నగరం వరకు నివాసిత ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయి. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల తరహాలో రానున్న రోజుల్లో విశాఖ-విజయనగరం కలిసి అభివృద్ధి చెందే అవకాశం ఉందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులను ఒప్పించి.. కోర్టుల్లో ఉన్న కేసులన్నీ పరిష్కరించి జీఎంఆర్ సంస్థకు ఆ భూములను అప్పగించారు.

నాడు

2019 ఫిబ్రవరి 14న భోగాపురం విమానాశ్రయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శిలాఫలకం ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాలేదు. శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే.. వంద మందికి పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఈ కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రిగా పని చేసిన అశోక్ గజపతిరాజు ముఖం చాటేశారు.

నేడు

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు త్రిముఖ వ్యూహం అనుసరించారు. భూసేకరణ పూర్తి చేయించారు. రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను తరచూ సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. ఇలా మార్గం సుగమమైన నేపథ్యంలో శంకుస్థాపనకు సర్వం సిద్ధమైంది.

సీఎం జగన్ పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ 9.30 గంటలకు బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలంలోని ఎ.రావివలస చేరుకుంటారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభ అనంతరం 12.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. 2.30 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్-4లో వైజాగ్ టెక్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత ఎంపీ ఎంవీవీ ఇంటికి చేరుకొని నూతన దంపతులైన ఆయన కుమారుడు, కోడలిని ఆశీర్వదిస్తారు. 5.30 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు.

నాడు

తమ ప్రభుత్వ హయాంలోనే అదానీ డేటా సెంటర్ వచ్చిందంటూ టీడీపీ నేతలు వాస్తవాన్ని దాచిపెట్టి గొప్పలకుపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడా భూమి కూడా చూపించకుండానే 2019 జనవరి 9వ తేదీన కాపులుప్పాడ, నక్కపల్లి, జి.చోడవరం ప్రాంతాల్లో మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు టీడీపీ ప్రభుత్వం హడావుడిగా అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదానీ డేట్ సెంటర్‌కు నిర్దిష్టంగా భూమిని కేటాయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఏయే సహాయ సహకారాలను అందిస్తున్న విషయాన్ని కూడా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మధురవాడలోని సర్వే నంబర్ 409లో 130 ఎకరాల్లో అదానీ డేట్ సెంటర్ ఏర్పాటవుతోంది. కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ కోసం 60.29 ఎకరాలను కూడా కేటాయించింది. ఇందుకు అనుగుణంగా 2023 మార్చి 11న ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ అదానీ డేటా సెంటర్

వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ (వీటీపీఎల్) ఆధ్వర్యంలో రూ. 21,844 కోట్లతో 190.29 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌తో పాటు ఐటీ, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు కానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం ఏడేళ్ల కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్టు కంపెనీ ఒప్పందం చేసుకుంది.



పెట్టుబడులు ఇలా..

మొదటి దశలో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
200 ఎండబ్ల్యూ డేటా సెంటర్	10,288	4,040
ఐటీ, బిజినెస్ పార్క్	2,363	15,110
స్కిల్ సెంటర్	1,171	3,750
మొత్తం	14,634	24,990

రెండో దశ(కాపులుప్పాడ వద్ద)లో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
100 మెగావాట్ల డేటా సెంటర్	5,070	2,200
ఐటీ, బిజినెస్ పార్క్	1,165	15,350
స్కిల్ సెంటర్	400	1,025
రిక్రియేషన్ సెంటర్	575	1,875
మొత్తం	7,210	20,450

నాలుగు దశల్లో చేపట్టనున్న ఈ నిర్మాణాలను ఏడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని కంపెనీ తెలిపింది.

న్యూస్‌రీల్

హైవే బాధితులకు కలెక్టర్ భరోసా

- తాజంగిలో పీవోతో కలిసి పర్యటన


గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్, పీవో

చింతపల్లి రూరల్: హైవే విస్తరణకు భూములు, గృహాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తగిన పరిహారాన్ని చెల్లిస్తుందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి మంగళవారం ఆయన మండలంలోని తాజంగిలో పర్యటించారు. ఇక్కడ హైవే రోడ్డు పనులను, రిజర్వాయర్‌ను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించారు. వివిధ సమస్యలపై గిరిజనులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం చింతపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

అడ్డతీగల: తిరుపతి జిల్లా తడ వద్ద శ్రీసిటీలో యాంకర్, పానాసోనిక్ కంపెనీల్లో ట్రైనీ పోస్టులకు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ శాఖ సహకారంతో ఐటీఐలో అన్ని ట్రేడ్‌ల అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఏడాదికి రూ.1.80 లక్షల జీతభత్యాలు చెల్లిస్తారన్నారు. 26 ఏళ్ల లోపు వయసు కలిగిన పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 6304634447 సంప్రదించాలన్నారు.

విద్యాశాఖ ఆర్జేడీగా లింగేశ్వర రెడ్డి

విశాఖ విద్య: విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా బి.లింగేశ్వర రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్జేడీగా పనిచేస్తున్న జ్యోతికుమారి సెలవుపై వెళ్లటంతో ఆమె స్థానంలో విజయనగరం డీఈవో లింగేశ్వర రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మన్యం పార్వతీపురం జిల్లా ఐటీడీఏ డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న పి.బ్రహ్మాజీరావును అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదే విధంగా అనకాపల్లి జిల్లా యలమంచిలి డిప్యూటీ డీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎన్.ప్రేమ్‌కుమార్‌ను మన్యం పార్వతీపురం జిల్లా డిప్యూటీ డీఈవోగా బదిలీ చేసి, జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ అధికారి(డీఎస్ఈవో)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటులో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం కల్పించనట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన విద్యార్థులను లాటరీ ద్వారా ఈ నెల 22న ఎంపిక చేసి, జాబితా విడుదల చేస్తామన్నారు. ఆసక్తి గల వారు http://cre.ap. gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సమీపంలోని డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను సంప్రదించాలన్నారు.

జూన్ 6న మోదకొండమ్మ జాతర

సతకంపట్టు వద్ద కొలువురాట నేడు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 6న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మంగళవారం తెలిపారు. జాతరలో భాగంగా ఈ నెల 3(బుధవారం)న సతకంపట్టు వద్ద అమ్మవారి కొలువు రాట వేయనున్నట్టు పేర్కొన్నారు. 7న జాతరపై గ్రామంలో చాటింపు వేస్తామని, 9న అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను ఆలయం నుంచి సతకంపట్టు వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తెచ్చి, కొలువుదీర్చనున్నట్టు వెల్లడించారు. సుమారు నెల రోజుల పాటు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. పండగ రోజు సతకంపట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఆలయానికి చేర్చడంతో పండగ ముగుస్తుందని కమిటీ తెలిపింది.

అమ్మవారి ఆలయంలో భక్తుల తాకిడి

మంగళవారం అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. స్థానికంగా వీధి పండగలు జరగడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

డీఏ పెంపుపై సచివాలయ ఉద్యోగుల హర్షం

అల్లిపురం (విశాఖ దక్షిణ): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జనవరి 1, 2022 నుంచి ఇవ్వాల్సిన డీఏను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖపట్నం ప్రెసిడెంట్ పీజే గణేష్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించినందుకు సచివాలయ ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

కలెక్టర్ సుమిత్‌కుమార్



అభ్యర్థులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: విద్యార్థులు ఉన్నత చదువుతోపాటు నైపుణ్య రంగాల్లో శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమయం వృథా చేయకుండా, విజయం సాధించే వరకు సాధన చేయాలన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్తే భవిష్యత్తు ఉండదన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను చదివిస్తారని, వారికి చెడ్డపేరు మాత్రం తీసుకు రాకూడదని పేర్కొన్నారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలను అధిరోహించే లక్ష్యంతో కృషి చేయాలన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామకపు పత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత, శిక్షణ, ఉద్యోగ కల్పనాధికారి ఎం. రూపణి, ఎస్డీవో జి.ప్రశాంత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలి


మాట్లాడుతున్న కేసలి అప్పారావు, సీతారాం

ఎంవీపీకాలనీ: పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల్లో ఆయా కళాశాలల యాజమాన్యాలు మనోధైర్యం నింపాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కోరింది. ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంపై కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. పరీక్షల్లో విఫలమైతే విద్యార్థులు జీవితాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులు భవిష్యత్‌కు మార్కులు, మెరుగైన ర్యాంకులే శరణ్యం కాదన్నారు. ఈ దిశగా విద్యార్థులను ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు చైతన్య పరచాలని సూచించారు. మీడియాలో విద్యార్థుల ఆత్మహత్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా వారిపై ఒత్తిడి పెంచుతుందన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులు ఫొటోలు ప్రచురించడం, ఒత్తిడి చేయడం వంటివి మానుకోవాలన్నారు.

ముగ్గురు నకిలీ మావోయిస్టుల అరెస్ట్

కాంట్రాక్టర్లను బెదిరించి, రూ.లక్షలు డిమాండ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

చింతపల్లి: మావోయిస్టులమని చెప్పుకుంటూ కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్న ముగ్గురు నకిలీలను అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను, వారి వద్ద స్వాధీనం చేసుకున్న తుపాకులను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మీడియా ముందు ప్రవేశ పెట్టారు. జి.మాడుగుల మండలం రొయ్యలగెడ్డకు చెందిన గెమ్మెలి సత్తిబాబు, చిడిమెట్టకు చెందిన ములజంగి చిన్నారావు, చుట్టిమెట్టకు చెందిన కిల్లో ఏప్రాతో పాటు మరో ఇద్దరు మావోయిస్టులుగా చలామణీ అవుతూ కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. డబ్బులు ఇవ్వని పక్షంలో వారిని చంపుతామని, నిర్మాణ పనులకు వినియోగిస్తున్న యంత్రాలను కాల్చివేస్తామని బెదిరిస్తున్నారన్నారు. కోరుకొండకు సమీపంలోని ఎర్రగొప్పు వద్ద జేసీబీని మార్చి 20వ తేదీన కాల్చివేసి కాంట్రాక్టర్‌ను లూవ్వసింగి, కుడుమసారి, తమ్మంగుల పంచాయతీ సర్పంచుల ద్వారా బెదిరించి రూ.30 లక్షలు డిమాండ్ చేశారన్నారు. గత నెల 21న ఐదుగురు నకిలీ మావోయిస్టులు అలగం బ్రిడ్జి వద్దకు వెళ్లి ముగ్గురు సర్పంచుల ద్వారా కాంట్రాక్టర్‌ను పిలిపించుకుని నెలాఖర్లోగా రూ.30 లక్షలు ఇవ్వాలని, లేకుంటే యంత్రాలను కాల్చివేసి అతడిని చంపుతామని బెదిరించారన్నారు. రూ.5 లక్షలు ఇవ్వడానికి కాంట్రాక్టర్ ఒప్పుకున్నప్పటికీ వారు నిరాకరించారన్నారు. దీంతో బాధితుడు జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేయగా, సోమవారం పోలీసు బలగాలు అలగం బిడ్జి వద్ద మాటు వేసి ముగ్గురిని పట్టుకున్నాయని, ఇద్దరు పరారైనట్లు ఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, సీఐలు సత్యనారాయణ, రమేష్, ఎస్సైలు శ్రీనివాసరావు, అరుణ్‌కిరణ్ పాల్గొన్నారు.

జిల్లాలో అదుపులోనే మలేరియా

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక దృష్టి
- పెదబయలు, గోమంగి పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో జమాల్ బాషా తనిఖీ


పెదబయలు పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పెదబయలు: జిల్లాలో మలేరియా అదుపులోనే ఉందని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించామని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. మంగళవారం పెదబయలు, గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదబయలు పీహెచ్‌సీలో రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. గత నెలలో ఇక్కడ పీహెచ్‌సీ పరిధిలోని 8 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. రెండు కంటే ఎక్కువ పాజిటివ్ కేసులు నమోదైన గ్రామాల్లో ఇంటింటా తిరిగి రక్తపూతల సేకరణ చేయాలన్నారు. దోమల మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఇక్కడ మరమ్మతులకు గురైన మైక్రో స్కోప్‌ను వినియోగంలోకి తెస్తామన్నారు. అనంతరం ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై పలు సూచనలు చేశారు. జిల్లాలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా డ్రై డే, ఫ్రై డే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు.

కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్..

జిల్లాలో మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి పెట్టామని డీఎంహెచ్‌వో తెలిపారు. రక్తహీనత వల్లే మరణాలు సంభవిస్తున్నాయని, ముందస్తుగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి బర్త్ వెయిటింగ్ హాల్‌కు తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ నిర్వహణకు 13 మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అక్కడ గిరిజన రోగులను చేర్పించడం, సకాలంలో వైద్యం సేవలందించడం, ప్రతీ 15 రోజుల్లో ఆకస్మిక తనిఖీ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీపీహెచ్ఎన్‌వో భూలోకమ్మ, వైద్యాధికారి రమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సెల్' మోహన్‌రంగా!

- మన్యంలో సెల్ టవర్ల విప్లవం
- జిల్లాకు 2,323 టవర్ల మంజూరు

సాక్షి, పాడేరు: మన్యంలోని ప్రతి గ్రామంలో హలో.. హలో అంటూ సెల్‌ఫోన్లో మాటల సవ్వడి వినిపించనుంది. ఇంతవరకూ సరైన సిగ్నల్ వ్యవస్థ లేక చెట్లెక్కి.. ఎత్తయిన కొండలెక్కి ఫోన్లో మాట్లాడేందుకు అవస్థలు పడేవారు. ఈ ఇబ్బందులకు ఇక చెక్ పడనుంది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరవేసేందుకు సమాచార విప్లవానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,264 బీఎస్ఎన్ఎల్ టవర్లు, 584 జియో నెట్‌వర్క్, 37 ఎయిర్‌టెల్ టవర్లను ఆయా యాజమాన్యాలు మంజూరు చేశాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో 30 శాతం గ్రామాల్లో మాత్రమే సెల్‌టవర్లు, మొబైల్ సిగ్నల్స్, ఫోన్ నెట్‌వర్క్ పనిచేస్తోంది. కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో జిల్లాలో 70 శాతం గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 22 మండలాల్లో సచివాలయాల వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయాల్లో అమలు చేసే ప్రక్రియలో కమ్యూనికేషన్ వ్యవస్థ తీవ్ర అడ్డంకిగా మారింది. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టింది.

చురుగ్గా సెల్ టవర్ల నిర్మాణాలు

జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో సెల్ టవర్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. తొలుత మారుమూల, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సెల్ టవర్లను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, హుకుంపేట, జి.కె.వీధి, వై.రామవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల పరిధిలో పలు నెట్‌వర్క్‌లకు చెందిన 75 సెల్ టవర్లను పూర్తి చేయడంతో ఆయా ప్రాంతాల్లో సెల్ సంకేతాలు గిరిజనులకు అందుబాటులోకి వచ్చాయి. 673 ప్రధాన గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్, 18 గ్రామాల్లో ఎయిర్‌టెల్, 545 జియో టవర్ల నిర్మాణాలకు రెవెన్యూ యంత్రాంగం స్థలాలను మంజూరు చేసింది.


జి.మాడుగుల మండలం నుపతి సమీపంలో నిర్మించిన జియో సెల్ టవర్

అన్ని గ్రామాలకు సెల్ సంకేతాలు లక్ష్యం

జిల్లాలోని అన్ని గ్రామాలకు సెల్ సంకేతాలు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. గ్రామ సచివాలయాల వ్యవస్థను గిరిజనులకు అందుబాటులో తెచ్చే లక్ష్యంగా సెల్ టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాం. స్థలాల సమస్య లేకుండా రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల గిరిజనులకు మేలు కలుగుతుంది.
– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

క్లుప్తంగా

జాబ్ కార్డుదారులకే ఉపాధి పనులు

డ్వామా పీడీ రమేష్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రమేష్

డుంబ్రిగుడ: జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ ఎన్. రమేష్ ఆదేశించారు. మండలంలోని కొర్రా పంచాయతీ బుడుమాల పూట్టు గ్రామంలో మంగళవారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.272 వచ్చేలా పనులు చేయించాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో రెండు పూటలా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో నగేష్, ఎంపీటీసీ విజయ, నాయకుడు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్థసారథికి సాహిత్య పురస్కారం

పాయకరావుపేట: తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాల్లో శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎ.పార్థసారథి అయ్యంగార్‌కి జాతీయ సాహిత్య పురస్కారంతో సత్కరించారు. ఉత్తమ కవిత రచనకు పద్మశ్రీ ప్రొఫెసర్ కె.ఇనాక్ చేతుల మీదుగా జాతీయ సాహిత్య పురస్కారంతో పాటు, కవి శ్రేష్ఠ బిరుదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికతో సన్మానించారు. పోటీ ల్లో గెలుపొందినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి, ప్రశంసాపత్రం అందుకున్నారు.

అంబరాన్నంటిన మత్స్య మాడుగులమ్మ సంబరాలు



జి.మాడుగులలో మాడుగులమ్మ సన్నిధికి ఘటాల ఊరేగింపు



జి.మాడుగుల పురవీధుల్లో జనసందోహం

జి.మాడుగుల: గిరిజనుల ఆరాధ్య దైవం, మత్స్య మాడుగులమ్మ తల్లి సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం జి.మాడుగులకు గిరిజన, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఇక్కడ రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సతకంపట్టు వద్ద ప్రతిష్ఠించిన ఘటాలను పూజించారు. వీటిని డప్పువాయిద్యాల నడుమ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించి ఆలయ సన్నిధికి చేర్చారు. ఈ వేడుకలో మాజీ మంత్రి మణికుమారి, ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు మత్స్యరాస వరహాలరాజు, మత్స్యరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం రామకృష్ణంరాజు, నారాయణరాజు, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలో పలు గ్రామాల నుంచి ప్రీతిపాత్రమైన మట్టి ఘటాలను తలపై పెట్టుకుని డప్పువాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపుగా మాడుగులమ్మతల్లి సన్నిధికి చేర్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సంబరంలో తీన్‌మార్, బిందెల నృత్యాలు, శక్తివేషాలు, బాణసంచా కాల్పులు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కిముడు రాంబాబు, ఉత్సవ కమిటీ నాయకుడు ఎం. రామారాజు, మాజీ ఎంపీపీలు ఎం. వరహాలమ్మ, ఎస్.వి. రమణ, కల్యాణం, గణపతి, కోటేశ్వరరావు, సీహెచ్ వెంకటరమణ, వడ్డాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా శక్తి వేషం, బిందెల నృత్యం

మాతృ మరణాల నివారణకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: గిరిజన ప్రాంతాల్లో మాతృ మరణాల నివారణకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయం నుంచి వైద్యాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఎంత మంది గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై పర్యవేక్షిస్తున్నారో డేటా సమర్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సేవలు, ప్రోత్సాహకాలు పొందడానికి ఆర్సీహెచ్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో 1,800 మంది గర్భిణులకు ఆర్సీహెచ్ ఐడీ బ్యాంకు ఖాతాలు లేవని, వారందరికీ వీటిని కల్పించాలని స్పష్టం చేశారు. సబ్ సెంటర్ల వారీగా డేటా ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, 104 సేవల్లో సమాచారం ఎంట్రీ చేయాలని చెప్పారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలన్నారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవలందించాలన్నారు. వైద్య సేవలందించడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోమంగి వైద్యాధికారి విజ్ఞప్తి మేరకు ఇద్దరు ఆరోగ్య సహాయకులను డిప్యూట్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్‌బాషా, జిల్లా క్షయ నివారణాధికారి విశ్వేశ్వరనాయుడు, పీహెచ్‌సీల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మబంధువుకు అశ్రు నీరాజనం



అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న నాయకులు

రావికమతం: ఓ వృద్ధురాలు...ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు... భాష తెలియదు...మతి స్థిమితం లేదు....కానీ ఆ గ్రామస్తులకు ఆప్తురాలైంది. గ్రామంలో ఎక్కడ చెత్త ఉన్నా ఎత్తి ఊరు చివర పోస్తూ ఉండేది. చినపాచిల గ్రామంలోని నూకరాజు మాస్టారు ఇంటి ఆవరణలోనే ఆమె నివాసం. వయస్సు 60 పైబడినా చలాకీగా తిరిగేది. ఆమెది మంచి మనసని భావించేవారు. ఆమె ఎదురొస్తే మంచి జరుగుతుందని భావించే వారు. మంచి మామ్మ, పిచ్చిమామ్మ అంటూ పిలుస్తూ గ్రామస్తులు ఆప్యాయత కనబరిచేవారు. నూకరాజు మాస్టారు మాత్రం ఆమెకు పాదాభివందనం చేసేవారు. అతని ఇంటనే ఆశ్రయం ఇచ్చేవారు. అటువంటి ఆప్తురాలు లోకం విడిచి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం కమ్యూనిటీ హాల్లో ఆమె కదలకుండా పడి ఉంది. అనుమానం వచ్చిన ఆ గ్రామస్తులు పరిశీలించగా మృతి చెందినట్టుగా గుర్తించారు. దీంతో ఆ విషయం గ్రామమంతా తెలిసింది. కోఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కొమార ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు జనపాల వెంకట్రావుతో పాటు పలువురు అక్కడకి చేరుకున్నారు. ఆమెకు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంతిమ యాత్ర చేసి, దహన క్రియలు నిర్వహించారు.

గంజాయితో పట్టుబడ్డ ఇద్దరి అరెస్ట్

కె.కోటపాడు : ఆనందపురం జంక్షన్‌లో మంగళవారం 4 కిలోల గంజాయితో ఇద్దరు యువకులను పట్టుకున్నట్లు ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. చేతిలో సంచులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న హైదరాబాద్‌కు చెందిన యువకులు వికాస్, రాకేష్‌లను తనిఖీ చేయగా, వారి సంచుల్లో గంజాయి ఉన్నట్టు తేలింది. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జూన్ కల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గృహ నిర్మాణశాఖ పీడీ బాబు సమీక్ష



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు

ముంచంగిపుట్టు: వచ్చే నెలాఖరు కల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారులను గృహ నిర్మాణశాఖ పీడీ బి.బాబు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గృహ నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. ఇళ్ల పరిస్థితిని పంచాయతీల వారీగా ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 536 గృహాలు మంజూరయ్యాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జూన్ కల్లా 196 గృహాలు పూర్తి చేసేలా పని చేయాలన్నారు. నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. వివిధ దశలో నిలిచిపోయిన గృహాలకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని, లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమవుతుందని, మరికొన్ని బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ టీడీ వెంకటరావు, డీఈ మోహన్‌రావు, ఏఈ సిహెచ్.కృష్ణారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు హేమలత, కృష్ణారావు పాల్గొన్నారు.

సర్పంచ్ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు



విలేకరులకు వివరాలు చెబుతున్న గ్రామస్తులు కిరణ్, కృష్ణ, బాలరాజు తదితరులు

కొయ్యూరు: రహదారుల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరైన పనులకు సంబంధించిన తీర్మానంపై రాజేంద్రపాలెం సర్పంచ్ పిటా సింహాచలం సంతకం చేయడం లేదని ఐటీడీఏ పీవో అభిషేక్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామని టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్‌తో పాటు గ్రామస్తులు నర్సి కృష్ణ, బాలరాజు తదితరులు చెప్పారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అరకు ఎంపీ మాధవి రాజేంద్రపాలెంను దత్తత తీసుకున్నారని, ఈ మేరకు నర్సి కృష్ణ ఇంటి నుంచి కాకర రామలక్ష్మి ఇంటి వరకు రూ.1.70లక్షలు, అల్లూరి పార్క్ నుంచి శ్మశానం వరకు రోడ్డుకు రూ.2.80లక్షలు, దిబ్బ గంగమ్మ ఇంటి నుంచి దిబ్బ లక్ష్మణరావు ఇంటివరకు రూ.2లక్షలతో సీసీ రోడ్డు వేసేందుకు మొత్తంగా రూ.6.5 లక్షలు ఎంపీ కేటాయించారన్నారు. అయితే సర్పంచ్ పిటా సింహాచలం దీనికి సంబంధించిన నెల రోజుల నుంచి తీర్మానంపై సంతకం చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఈ మేరకు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

తహసీల్దార్ విచారణ

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ తిరుమలరావు రాజేంద్రపాలెం గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. రోడ్డు పనుల కోసం ఎంపీ నిధులు మంజూరు కావడంతో వాటికి అనుమతి ఇవ్వాలని సర్పంచ్ సింహాచలం దృష్టికి తెలియజేశారు. జాప్యం చేయడం తగదన్నారు. దీనిపై స్పందించిన సర్పంచ్ పిటా సింహాచలం మాట్లాడుతూ తీర్మానంపై సంతకం చేస్తామని తహశీల్దారు తిరుమలరావుకు తెలిపారు.

మన్యంలో భారీ వర్షం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా కాచింది. ఆ తర్వాత కారుమేఘాలు కమ్ముకుని అరగంట పాటు వర్షం పడింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పొలాల్లోకి నీరు చేరింది. ఈ వర్షంతో రైతులు ఖరీఫ్ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలోని తీగలవలస, మట్టుజోరు, శోభకోట, మఠం పంచాయతీల్లో మంగళవారం భారీ గాలివానతో గిరిజనులు భయాందోళన చెందారు. ప్రధాన రహదారుల్లో, పొలాల్లో వర్షపు నీరు చేరింది.

రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రయాణాలపై వెళ్లే వారు గమ్యం చేరేందుకు నానా అగచాట్లు పడ్డారు. మరోవైపు పెళ్లి, తదితర శుభకార్యాలకు సంబంధించి ఏర్పాట్లలో ఉన్న వారు అసహనం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మండలంలో సోమ, మంగళవారాల్లో వరుసగా 43.2 ఎం.ఎం, 28.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది.

విశాఖకు దేశంలోనే సమున్నత స్థానం

- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అదాని సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: విశాఖను దేశంలో సమున్నత స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మధురవాడ ఐటీ హిల్ నెంబర్-4లో వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేయనున్న సందర్భంగా ఏర్పాట్లను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని డేటా సెంటర్ విశాఖకు గొప్ప వరంగా మారనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రాజెక్టు ఊతంలా నిలబడుతుందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారిపోతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పటికి గుర్తుండిపోయే రెండు అతి పెద్ద ప్రాజెక్టులకు ఒకే రోజు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం గర్వకారణం అని తెలిపారు. వారి వెంట ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మాటలు కోటలు దాటుతుంటాయి

చంద్రబాబు మాటలు కోటలు దాటుతుంటాయని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ఎప్పుడు చేస్తూ ఉంటారని మంత్రి విడదల రజని అన్నారు. కేవలం ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసి తామే సాధించాం అన్నట్లుగా ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉంటుందని తెలిపారు. అప్పట్లో ఆయన భూసేకరణ సరిగ్గా చేపట్టలేదని ఆరోపించారు. కోర్టులో కేసులు ఉన్నా పరిష్కారానికి ప్రయత్నించలేదని, పర్యావరణ అనుమతులు తెప్పించాలనే స్పృహ లేకుండా గత ప్రభుత్వం పనిచేసిందని మండిపడ్డారు.

కన్నీటి సంద్రం

- రేవుపోలవరం తీరంలో నీట మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- పుట్టిన రోజు వేడుక విషాదాంతం





తీరంలో మృతవాత పడిన జగదీష్ మృతదేహం (ఇన్‌సెట్) జగదీష్ (ఫైల్)

ఎస్.రాయవరం/నర్సీపట్నం: సాగర ఘోషను మించిన కేరింతల హోరు ముందు కెరటాలు చిన్నబోయాయి. ఆనందం ఉరకలేయగా యువకులంతా సందడి చేశారు. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా ఏడుగురు బీటెక్ విద్యార్థులు సముద్ర తీరంలో కేక్ కట్ చేశారు. అనంతరం ముగ్గురు స్నానానికి దిగారు. వారిలో ఒకరు కెరటాల పాలు కావడంతో ఒక్కసారిగా విషాదం అలముకుంది. తీవ్ర గాలింపు అనంతరం మృతదేహం కూడా లభించడంతో తీరం కన్నీటి సంద్రమే అయ్యింది. రేవుపోలవరంలో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మాకవరపాలెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు తీరం ఒడ్డున మిత్రుడి బర్త్‌డే జరుపుకున్నారు. కేక్ కటింగ్ అనంతరం ముగ్గురు యువకులు స్నానానికి దిగారు. అందులో నర్సీపట్నం మండలం గురందరపాలెం గ్రామానికి చెందిన కొల్లాన జగదీష్ (18) కెరటాల్లో చిక్కాడు. పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో నేవీ హెలికాప్టర్‌తో గాలించారు. కాసేపటికి బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల మధ్య తీరంలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చినట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. తండ్రి లేకపోవడంతో తల్లి పద్మ టిఫిన్ సెంటర్ నడుపుతూ జగదీష్‌ను, అతని సోదరిని చదివించుకుంటోంది. ఇంజినీరింగ్ చదువుతున్న కొడుకుని చూసుకొని త్వరలో కష్టాలు తీరుతాయని ఆనందపడింది. తన ఆశలు నీటిపాలు కావడంతో ఆమె కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనతో గురంధరపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడి

- ప్రతీ కష్టం వెనుక అవకాశాలు ఉంటాయి
- ఏయూ వీసీ ప్రసాద రెడ్డి



హాజరైన విద్యార్థులు



విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడిగా యువతరం అంకుర సంస్థలను స్థాపించాలని, దీనికి అవసరమైన పెట్టుబడి, మౌలిక వసతులు వర్సిటీ పరంగా అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థుల ఉద్యోగ విజయోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వృత్తిపరమైన సవాళ్లను అధిగమించడానికి, నిర్ధారిత లక్ష్యాలను ఛేదించడానికి మానసికంగా సిద్ధం కావాలన్నారు. ప్రతీ కష్టం వెనుక అవకాశాలు ఉంటాయనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. దేశానికి నూతన గతి శక్తిగా యువతరం నిలుస్తారన్నారు. విశ్వవిద్యాలయం ఆరంభం కేవలం ఆర్ట్స్ కోర్సులతోనే ప్రారంభం అయిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. మానవ సంబంధాలకు ఆర్ట్స్ కోర్సుల అభ్యసనం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. సమాజంతో మృగ్యమవుతున్న విలువలను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నిత్యం తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ తల్లిదండ్రుల విలువ తెలుసుకుని మసలుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశానికి ఇన్నోవేషన్, ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంతో అవసరమన్నారు. దీనికి అవసరమైన మౌలిక వసతులను వర్సిటీ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహా రావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్ రెడ్డి, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం 202 మంది విద్యార్థులకు 350కిపైగా ఉద్యోగ నియామక పత్రాలను వీసీ ప్రసాద రెడ్డి అందజేశారు. వేదికపై తల్లిదండ్రులను సత్కరించి, వారి పాదాలకు నమస్కరించిన అనంతరం విద్యార్థులు నియామక పత్రాలను స్వీకరించారు.

యూనివర్సిటీ ప్రగతి బాగుంది



మాది ప్రకాశం జిల్లా చీరాల. మా అబ్బాయిని ఎంబీఏలో ఎక్కడ చేర్పించాలనే అన్వేషణలో ఏయూ ప్రగతి బాగుందని తెలిసింది. ఇక్కడ చేర్పించాను. మా అబ్బాయి ఫెడరల్ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది. ఏయూపై మేము పెట్టుకున్న నమ్మకం మరింత పెరిగింది. –రాంబాబు, చీరాల

ప్లేస్‌మెంట్ టీం బాగా పనిచేసింది



ప్లేస్‌మెంట్స్‌ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఒక టీంని ఏర్పాటు చేశారు. వీరు ఎంతో సమర్థవంతంగా, సమన్వయంతో పనిచేశారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఫెడరల్ బ్యాంక్‌కు రూ 13.5 లక్షల వేతనంతో ఎంపిక అయ్యాను. మంచి వేతనాలతో ఎక్కువ మంది ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది. –మురళీకృష్ణ, ఎంబీఏ విద్యార్థి